క్లుప్తంగా...

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పాపయ్యనగర్ కాలనీకి చెందిన మల్లేష్ అనారోగ్యానికి గురవ్వగా సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును బుధవారం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల వద్దకే వైద్యాన్ని అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీమన్నారాయణ, శ్రీనాథ్, చంద్రరావు, మూర్తి, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ పర్యటన బృందంలో నందారెడ్డి



మేడ్చల్: వ్యవసాయంలో నూతన పద్ధతులు, సాంకేతిక పద్ధతులను అవగాహన చేసుకోవాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇజ్రాయిల్ దేశానికి వెళ్లే బృందంలో మేడ్చల్ జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నారెడ్డి నందారెడ్డికి చోటు లభించింది. ప్రభుత్వం 30మంది ప్రతినిధులను ఎంపిక చేసి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను తెలుసుకునేందుకు ఈ నెల 5న ఇజ్రాయిల్ దేశ పర్యటనను ఏర్పాటు చేయగా రాష్ట్ర బృందంలో జిల్లాకు చెందిన నందారెడ్డిని ఎంపిక చేసింది. ఈ బృందంలో ఇజ్రాయిల్‌లో 5 రోజుల పాటు పర్యటించనుంది.

బీఆర్‌ఎస్ హయాంలోనే జోరుగా అభివృద్ధి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పానుగంటి బాబు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 26వ డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ పానుగంటి బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డివిజన్ అభివృద్ధి చెందుతుందన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

మేడ్చల్: పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు కమాలకర్ రెడ్డి, మంజుల ప్రకాష్, గణేష్, దేవరాజు, సత్యనారాయణ, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16వ వార్డులో అభివృద్ధి పనులు షురూ



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ ఉమానాగరాజు

మేడ్చల్: పట్టణంలోని 16వ వార్డులో వివిధ అభివృద్ధి పనులను వార్డు కౌన్సిలర్ ఉమానాగరాజు ప్రారంభించారు. వార్డులో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె పరిశీలించి పనులు వేగవతంగా నిర్వహించాలని కోరారు. మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో వార్డులో అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తామని తెలిపారు. వర్షాలకు వరదలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. పెద్ద చెరువు వాగును పూర్తిగా శుభ్రం చేశామని చెప్పారు.

15 మండలాలు.. 14 బృందాలు

- కొనసాగుతున్న జీఓ 59 దరఖాస్తుల పరిశీలన
- జీఓ 59 కింద వచ్చిన దరఖాస్తులు 15,200, పూర్తయినవి 9,102
- కలెక్టర్ అమయ్‌కుమార్ చొరవతో 7 రోజుల్లో పూర్తికి చర్యలు
- జీఓ 59 తర్వాతే.. జీఓ 58 దరఖాస్తుల పరిశీలన షురూ..

సాక్షి, మేడ్చల్ జిల్లా: సర్కారు ఆక్రమిత నివాస స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీఓ 58, 59 కింద రెండో విడతలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీవో 59 కింద 15,200 దరఖాస్తులు రాగా, జీఓ 58 కింద 26,092 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో జీఓ 59 కింద వచ్చిన 15,200 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో 41 బృందాలు విచారణ నిర్వహిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 9,102 దరఖాస్తుల పరిశీలన పూర్తి కాగా, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో మిగిలిన దరఖాస్తులను వారం రోజుల్లో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. విచారణ బృందాలకు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఇన్‌చార్జిగా వ్యవహరించేలా కలెక్టర్ అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారు. జీఓ 59 దరఖాస్తుల పరిశీలన పూర్తయిన తర్వాతే జీఓ 58 కింద వచ్చిన 26,092 దరఖాస్తులను విచారించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



అత్యధిక దరఖాస్తులు మేడ్చల్‌లోనే..

తెలంగాణలో అత్యధికంగా మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలోనే జీఓ 58,59 కింద దరఖాస్తులు 41,292 వచ్చాయి. దరఖాస్తుల విచారణలో భాగంగా ఇళ్ల పరిశీలన బృందాల్లో తప్పనిసరిగా డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ ఉండేలా కలెక్టర్ అమయ్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. క్షేత్రస్థాయి బృందం ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయడంతో పాటు జీవో నిబంధనల ప్రకారం ఉన్నాయా? లేదా అని చెక్ చేసుకోవడం, సేకరించిన ఆధారాలను ప్రత్యేకంగా రూపొందించిన ‘మొబైల్ యాప్’లో నమోదు చేసి, వాటిని కలెక్టర్ లాగిన్ సిఫార్సు చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ దరఖాస్తులను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మరోమారు పరిశీలించిన తర్వాత ఆమోదం లేదా తిరస్కరించే అవకాశం ఉంటుంది.

సొమ్ము చెల్లించింది 3,600

మొదటి విడతలో(గతంలో) మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో మొదటి విడతలో జీఓ 59 కింద 33,258 దరఖాస్తులు రాగా, ఇందులో 12,500 దరఖాస్తులు అర్హత సాధించాయి. అర్హత సాధించిన దరఖాస్తుదారులందరికీ సొమ్ము చెల్లించాలని రెవెన్యూ శాఖ వర్గాలు డిమాండ్ నోటీసులు జారీ చేయగా, ఇప్పటి వరకు 3,600 మంది దరఖాస్తుదారులు మాత్రమే మొత్తం సొమ్ము చెల్లించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మిగతా దరఖాస్తుదారులందరూ డిమాండ్ నోటీసులకు అనుగుణంగా సొమ్ము చెల్లించేలా.. జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. జీఓ 58 కింద మొదటి విడతలో 38,058 దరఖాస్తులు రాగా, వీటిని గతంలోనే 80 బృందాలు క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి అర్హులైన వారి జాబితాను జిల్లా కలెక్టర్ లాగిన్‌కు సిఫార్సు చేయగా, తుది పరిశీలన కోసం ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది.

మేడ్చల్ జిల్లాలో భారీగా తహసీల్దార్ల బదిలీలు

పోస్టింగ్ ఉత్తర్వులను జారీచేసిన కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాకు చెందిన పలువురు తహసీల్దార్లకు రిలీవింగ్, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని వివిధ మండలాలకు అలాట్ చేస్తూ బుధవారం పోస్టింగ్ ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ జారీ చేశారు.

ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రిలీవ్

మేడ్చల్ జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను పరిపాలన ప్రాతిపదికన బదిలీ చేస్తూ కలెక్టర్ అమయ్‌కుమార్ రిలీవింగ్ ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతిపై డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఘట్‌కేసర్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.వి జయలక్ష్మి భద్రాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా అలాగే, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.పద్మప్రియ నిర్మల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు..

ఇతర జిల్లాల నుంచి పలువురు తహసీల్దార్లు మేడ్చల్ జిల్లాకు బదిలీపై రాగా, వారికి పోస్టింగ్ ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారు. హైదరాబాద్ జిల్లాలో తహసీల్దార్లుగా పనిచేస్తున్న బి.శైలజను మేడ్చల్‌కు, ఎస్.ఎమ్.హసీనాను మేడిపల్లికి అలాట్ చేశారు. జనగామ్ తహసీల్దార్ ఎల్.పూల్‌సింగ్‌ను బాచుపల్లికి, నల్గొండ జిల్లాలోని తహసీల్దార్లు సైదులును కుత్బుల్లాపూర్‌కు, కృష్ణారెడ్డిని ఉప్పల్‌కు, రంగారెడ్డి జిల్లా తహసీల్దార్లు టి.సుచరితను దుండిగల్ గండిమైసమ్మ మండలానికి, అలాగే, ఎల్.రాంమోహన్‌ను మేడ్చల్ కలెక్టరేట్ ఏవోగా, వై.ఎస్ శ్రీనివాస్‌ను బాలానగర్‌కు, అశోక్ కుమార్‌ను కీసరకు, వికారాబాద్ జిల్లాకు చెందిన సుధాలింగాను అల్వాల్ మండలానికి, సంగారెడ్డి జిల్లాకు చెందిన జె.స్వామిని కూకట్‌పల్లికి, సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎం.సుజాతను కాప్రాకు, మేడ్చల్ జిల్లాకు చెందిన జి.కృష్ణను ఘట్‌కేసర్ మండలానికి, ఎల్.వెంకటేశ్వరరావును కీసర రెవెన్యూ డివిజన్ డీఏవోగా బదిలీ చేస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ జారీ చేశారు.

జిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లు..

మేడ్చల్ జిల్లాలో తహసీల్దార్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.మహిపాల్‌రెడ్డి జనగామ జిల్లాకు, తహసీల్దార్లు పి.సంజీవరావు, ఎం.ఎస్తేర్ అనిత, కె.నాగమణి, వై.గౌరీవత్సల, ఎస్.ఆర్.సరిత సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. తహసీల్దార్లు ఎం.సురేందర్, ఆర్.గోవర్ధన్, కె.గౌతమ్‌కుమార్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, తహసీల్దార్ డి.అహల్య హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. వీరందర్నీ రిలీవ్ చేస్తూ కలెక్టర్ అమయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్నాళ్లకు వచ్చావా కేఎల్‌ఆర్..?



రైతు బజార్ వద్ద సెల్ఫీ దిగుతున్న కేఎల్‌ఆర్

- ఎలక్షన్లలో పోటీ చేస్తారు.. మాయం అవుతారు..
- అడ్డుకున్న కాంగ్రెస్ మరోవర్గం నాయకులు
- కేఎల్‌ఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు
- ఇరు వర్గాల నేతల వాగ్వాదం, బాహాబాహి

మేడ్చల్: తన హయంలో చేసిన అభివృద్ధి పనులతో సెల్ఫీ కార్యక్రమం పేరుతో మేడ్చల్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు కేఎల్‌ఆర్ బుధవారం మేడ్చల్ పట్టణంలో పర్యటించగా కాంగ్రెస్ పార్టీకే చెందిన మరోవర్గం నేతలు ఆయనను అడ్డుకున్నారు. కేఎల్‌ఆర్ తన హయంలో నిర్మించిన, చేసిన అభివృద్ధి పనుల వద్ద తన అనుచరులతో కలిసి సెల్ఫీలు దిగి 8వ వార్డులో పర్యటించారు. 8వ వార్డుకు రాగానే అక్కడే ఉన్న కాంగ్రెస్ మరో వర్గం నేతలు ఆయనను అడ్డుకున్నారు. ఇన్నేళ్లు ఎటు వెళ్లారు.. కార్యకర్తలను ఏనాడైనా పట్టించుకున్నారా.. ఎలక్షన్లలో పోటీ చేస్తారు.. మాయం అవుతారు.. తిరిగి ఎన్నికలు వస్తున్నాయని వచ్చారా.. కేఎల్‌ఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కేఎల్‌ఆర్ వర్గం నేతలు, మరో వర్గం నేతలు వాగ్వాదానికి దిగడంతో గందోరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరు వర్గాల నేతలు, కార్యకర్తలు గూమిగూడి బాహాబాహికి దిగారు. చాలా సమయం వరకు కాంగ్రెస్ నేతలు ఒకరినొకరు దూషించుకుంటూ అక్కడే ఉండిపోయారు. 8వ వార్డు కౌన్సిలర్ చాపరాజు జోక్యం చేసుకుని కేఎల్‌ఆర్ తమ ఇంటికి వచ్చాడని, తాము ఇంటికి తీసుకెళ్తామని చెప్పి సముదాయించారు. కేఎల్‌ఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయి పట్టణంలో తన పర్యటన సాగించారు. 8వ వార్డులో వర్షాలకు కూలిపోయిన ఇళ్లను ఆయన పరిశీలించి కొంతమందికి ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. రైల్వే అసంపూర్తి బ్రిడ్జిని సందర్శించి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



కేఎల్‌ఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకుల బాహాబాహి

నెల రోజుల్లో రైల్వే వంతెన పనులు పూర్తిచేస్తాం



ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన పనులు ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, చైర్ పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్‌లో కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: దశాబ్దన్నర కాలంగా ఎదుర్కొంటున్న రైల్వే గేటు కష్టాలు త్వరలో తీరనున్నాయని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణ పనులను చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ గత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వంతెన పనులు ముందుకు సాగలేదన్నారు. ప్రజల కష్టాన్ని గమనించి నెలలో వంతెన పనులు పూర్తి చేస్తానని కంట్రాక్టర్ హామీ ఇచ్చాడని చెప్పారు. మండలంలో ప్రతి గ్రామం, మున్సిపాలిటీలో సొంత నిధులతో అభివృద్ధి పనులు పూర్తిచేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని హామీనిచ్చారు.

పేద యువతుల వివాహానికి ఆర్థిక సాయం

రాష్ట్రంలో పేద యువతుల వివాహానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మండలంలోని 46 మంది లబ్ధిదారులు కల్యాణలక్ష్మీ చెక్కులను జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్యతో కలిసి బుధవారం పంపిణీ చేశారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డికి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు.

కుట్టుమిషన్లు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పోచారం: అన్నోజిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి బుధవారం పంపిణీ చేశారు. అలాగే నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన 30 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, ఎన్‌ఏసీ అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ పనుల పరిశీలన

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ జి.రాజేంద్రకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డీఈ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలెబ్రిటీ విల్లాస్‌లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

శామీర్‌పేట్: శామీర్‌పేట సెలెబ్రిటీ విల్లాస్‌లో చోరీ జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. వివరాలు.. శామీర్‌పేటలోని సెలెబ్రిటీ విల్లాస్‌లో విల్లా నంబర్–9లో భార్యతో కలిసి దాసరి మహేందర్‌రెడ్డి నివాసం ఉంటున్నాడు. న్యూజిలాండ్‌లో ఉండే తన కూతురు వద్దకు భార్యభర్తలు జూలై 24న వెళ్లారు. కాగా స్నేహితుడైన రంగారెడ్డి బుధవారం ఉదయం విల్లాను శుభ్రం చేయించేందుకు వెళ్లగా మెయిన్ డోర్ తెరిచి ఉండి ఇంట్లోని సామాగ్రి, బీరువా ధ్వంసమై ఉండటంతో డయల్ 100కు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్



శామీర్‌పేట్: మండలంలో బుధవారం ఉదయం మిషన్ భగీరథ పైపులైన్ పగలడంతో నీరు వృథాగా పోయింది. శామీర్‌పేట మండల కేంద్రంలోని పెద్దచెరువు వద్ద గల బ్రిడ్జి కింద నగరానికి వెళ్లే మిషన్ భగీరథ పైపులైన్ పగిలి 20 అడుగుల ఎత్తుకు నీరు ఎగిసిపడింది. సుమారు 2 గంటల అనంతరం మిషన్ భగీరథ అధికారులు స్పందించి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

కీసర: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కీసర గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు రామిడి స్వప్నవిజయ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కీసర గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 29 రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అనంతరం కార్మికులకు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. కాంగ్రెస్ నేతలు జూపల్లి రవీందర్, చిక్కుడు రమేష్‌ముదిరాజ్, మల్లేష్‌యాదవ్, రామిడి విజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలోని 6వ వార్డులో సీసీ రోడ్డు పనులను బుధవారం మేడ్చల్ వైస్ ఎంపీపీ వెంకటేశ్, గ్రామ సర్పంచ్ మహేందర్, ఉపసర్పంచ్ రాజరాం, వార్డు సభ్యులు ఆకుల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టం సంతోషకరం అన్నారు. గ్రామాల అభివృద్ధికి సొంత నిధులు వెచ్చిస్తున్న మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు హరత్‌రెడ్డి, వార్డు సభ్యులు బాబు, బంటు భాస్కర్, నాయకులు నర్సింగ్‌రావు, కొముర‌య్య, లింగం, నాగులు, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు



శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది

శామీర్‌పేట్: విధులకు ఆటంకం కలిగించి వారిపై చర్యలు తీసుకోవాలని శామీర్‌పేట గ్రామపంచాయతీ కార్యదర్శి మౌనిక శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. శామీర్‌పేట గ్రామ పరిధిలోని సర్వే నంబరు 1215, 1216, 1217లో గల జిలేలు కుంట చెరువు అలుగు వద్ద నిర్మాణాలు చేపడుతున్నారని శామీర్‌పేట ఎంపీపీ, ఇరిగేషన్ అధికారులు గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో కలిసి చెరువు అలుగు వద్దకు విచారణ జరిపేందుకు వెళ్లారు. కాగా స్థానికులైన జయారెడ్డితో పాటు కుటుంబసభ్యులు కలిసి గ్రామ పంచాయతీ సిబ్బందిపై దాడి చేసి, దుర్భాషలాడారు. తమ విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మౌనిక తెలిపారు.

లింకులు క్లిక్ చేయవద్దు



మాట్లాడుతున్న డీసీపీ జానకి

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్(వీబీఐటీ) కళాశాలలో సైబర్ జాగృక్త దివస్‌లో భాగంగా బుధవారం సైబర్ స్టాకింగ్, సైబర్ బెదిరింపులు, ట్రెండింగ్ సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాచకొండ సైబర్ క్రైం డీసీపీ అనురాధ మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగించే సమయంలో భద్రత చర్యలు చేపట్టాలని, సైబర్ స్టాకింగ్, బెదిరింపులు నివారించడానికి తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దన్నారు. మల్కాజిగిరి డీసీపీ జానకి మాట్లాడుతూ సైబర్ స్టాకింగ్, బెదిరింపులు, మోసాలకు పాల్పడి వ్యక్తిగత జీవితానికి మచ్చ తెచ్చుకోవద్దన్నారు. అపరిచిత వ్యక్తులకు పాస్‌వర్డ్ చెప్పొద్దని, లింకులను క్లిక్ చేయకూడదని హెచ్చరించారు. రాచకొండ సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశం, రాచకొండ షీ టీమ్స్ ఏసీపీ నరేందర్‌గౌడ్, మల్కాజిగిరి ఏసీపీ నరేశ్‌రెడ్డి, వీబీఐటీ చైర్మన్ గౌతంరావు, కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సహకారం అందిస్తా



కీసర: పేదల కోసం తనవంతు సహకారం అందిస్తున్నట్లు బీజేపీ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వి చారిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కీసర గ్రామం నందిననగర్‌కు చెందిన ఆలకుంట నిరీక్షణకు కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కీసర: నాగారం మున్సిపాలిటీలో బుధవారం సాయంత్రం కీసర సీఐ ఎం.వెంకటయ్య ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్స్ డ్రగ్స్. నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సీఐ వెంకటయ్య సైబర్ నేరాల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఐలు రాజశేఖర్, నాగరాజు, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, మాజీ వార్డుసభ్యులు నాగేందర్, కాలనీవాసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ హాక్స్ హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



హ్యాకథాన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు బాలాజీ, విజయకుమార్

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం ‘స్మార్ట్ హాక్స్’ 48 గంటల హ్యాకథాన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 31వ తేదీ నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ బాలాజీ ఉట్ల, డాక్టర్ విజయకుమార్, డీన్ మల్లికార్జున్‌రెడ్డి హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధ్యాపకులు ప్రదీప్‌కుమార్, దీప్తి, సమన్వయ కర్తలు కార్తీక్, నిహారిక, అనుష పాల్గొన్నారు.